క్లుప్తంగా

విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేత



ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడి మాడ ఉన్నత పాఠశాలలో 35 విద్యార్థులకు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్‌రావు, చాంద్‌పాషా క్రీడా దుస్తులు అందజేసినట్లు హెచ్‌ఎం చెన్నప్ప తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచేలా ప్రోత్సహించేందుకు క్రీడా దుస్తులు అందజేసినట్లు దాతలు వెంకటేశ్వర్ రావు, చాంద్‌పాషా పేర్కొన్నారు. భవిష్యత్‌లో మంచి క్రీడాకారులుగా ఎదగాలని, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి తాము ఎప్పుడు ముదుంటామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చెన్నప్ప, ఏపీపీసీ చైర్మన్ సాయిలీల, మాజీ సర్పంచ్ మోహన్‌జీ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



పెబ్బేరు రూరల్: మండలంలోని రంగాపూర్ గ్రామంలో వివిధ కారణాలతో మరణించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల కుటుంబాలకు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మంగళవారం చెక్కుల పంపిణీ చేశారు. మృతి చెందిన బూరమోని శేఖర్‌రెడ్డి, కేశపాగ బొజ్జన్న, గూడెం రాముల కుటుంబాలకు రూ.2 లక్షల జీవిత బీమా చెక్కులను అందజేశారు. అధికారంలో ఉన్నా.. లేకున్నా బీఆర్‌ఎస్ కార్యకర్తలను ఆదుకుంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ, మాజీ జెడ్పీటీసీ పద్మవెంకటేష్, కర్రె స్వామి, వనం రాములు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు సామగ్రి ..



ఆత్మకూర్: అంగన్‌వాడీ కేంద్రాలకు ఐసీడీఎస్ ప్రాజెక్టు జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మమ్మ ఆదేశాల మేరకు సామగ్రిని పంపిణీ చేసినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తెలిపారు. మంగళవారం ఆత్మకూర్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో మదనాపురం, అమరచింత, కొత్తకోట, ఆత్మకూర్ మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు బుక్‌రాక్, రౌండ్‌టేబుళ్లు, స్క్వేర్‌టేబుల్, మ్యాట్స్ ఇతర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జ్యోతి, శ్రీలత, నర్మద, సబీత, ఆయామండలాల అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పాన్‌గల్: మెదక్ జిల్లా నర్సాపూర్ రోడ్డు ప్రమాదంలో మండలంలోని శాగాపూర్ గ్రామానికి చెందిన బింగి శ్రీకాంత్‌యాదవ్ మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చిన విషయం తెలుసుకున్న నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సుధాకర్‌రావు మంగళవారం గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి, మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ భాస్కర్‌యాదవ్, బాలరాజుయాదవ్, సుబ్బన్నయాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు చంద్రశేఖర్‌నాయక్, సుధాకర్‌యాదవ్, తిరుపతి యాదవ్, కృష్ణయ్య మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ పూర్తి

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ఉపాధిహామీ పనులపై తనిఖీ నిర్వహించారు. కార్యక్రమానికి డీఆర్‌డీఓ ఉమాదేవి, జిల్లా అసిస్టెంట్ విజిలెన్స్ రహీం, అంబుడ్స్‌పర్సన్ సత్యనారాయణరెడ్డి, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ ఆంజనేయులు ఎంపీడీఓ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో లెక్కలు పరిశీలించారు. ఏప్రిల్ 01, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు 433 పనులు జరిగాయని, ఇందుకుగాను మొత్తం ఖర్చు రూ.6.11కోట్లు అయిందని మండల అధికారులు సభకు వివరించారు. ఇందులో పంచాయతీజ్ సీసీరోడ్లు, ఉపాధి పనుల నుంచి రూ.27.01లక్షలు, ఫెనాల్టీ రూ.14,300 అయిందని డీఆర్‌డీఓ తెలిపారు. రికవరీ డబ్బులు సంబంధిత అధికారులు చెల్లించాల్సిందేనని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీఓ నరేందర్ తదితరులు హాజరయ్యారు.

విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి

కొత్తకోట: విద్యార్థులు క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేశిని, మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ సూచించారు. మండల కేంద్రంలో సీఎం కప్ పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతోనే ఈ పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీరామ్‌మహేశ్వర్‌రెడ్డి, సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ చెన్నమ్మ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, కమిషనర్ పవన్‌కుమార్, ఎంఈఓ కృష్ణయ్య, శ్రీనివాసులు, బీచుపల్లియాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, జేఎం మిషేక్ పాల్గొన్నారు.

అట్టహాసంగా..

ఆత్మకూర్: స్థానిక జాతర మైదానంలో సీఎం కప్ పోటీలను మంగళవారం అట్టహాసంగా ప్రారంభించారు. కార్యక్రమంలో పుర చైర్‌పర్సన్ గాయత్రి, ఎంపీఓ శ్రీరాంరెడ్డి, ఎంఈఓ బాలరాజు, కమిషనర్ శశిధర్, మాజీసర్పంచ్ గంగాధర్‌గౌడ్ ఫిజికల్ డైరెక్టర్లు సంతోష, వెంకట్, మహేష్, ప్రేమ్‌కుమార్, కోచ్‌లు అబ్దుల్‌ఖాదర్, రాజు పాల్గొన్నారు.

అమరచింత: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో మంగళవారం సీఎం కప్ క్రీడలను ఎస్ఐ సురేష్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ భాస్కర్ సింగ్ ప్రారంభించారు.

పోటీలు ప్రారంభం

గోపాల్‌పేట: రేవల్లి మండల కేంద్రంలో సీఎం కప్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో వాడల పర్వతాలు, రేవల్లి ఎంపీడీఓ నరసింహారెడ్డి, హెచ్‌ఎం ప్రసాద్, సింగిల్‌విండో చైర్మన్ రఘుయాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గోపాల్‌పేట మండల కేంద్రంలో ఎంపీడీఓ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో సీఎం కప్ పోటీలు ప్రారంభించారు.

మదనాపురంలో..

మదనాపురం: మండల కేంద్రంలో మంగళవారం సీఎం క్రీడా పోటీలను మార్కెట్ చెర్మన్ పల్లెపాగ ప్రశాంత్ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్రహం లింకన్, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఎంఈఓ ఫరూక్ హుస్సేన్ పాల్గొన్నారు.



కొత్తకోటలో క్రీడలను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఆత్మకూర్‌లో..



మదనాపురంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



రేవల్లిలో..



అమరచింతలో..

ఆశా వర్కర్ల ముందస్తు అరెస్ట్



గోపాల్‌పేట: మండల కేంద్రంలో మంగళవారం ఎనిమిది మంది ఆశావర్కర్లను ముందస్తు అరెస్టు చేసి మధ్యాహ్నం తర్వాత వదిలిపెట్టామని గోపాల్‌పేట ఎస్ఐ నరేష్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆశాల జీతాల పెంపు, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన చలో హైదరాబాద్‌కు తరలివెళ్తున్న నేపథ్యంలో వారి ముందస్తు అరెస్టు చేశారు.

వనపర్తి (ఖిల్లాఘనపురం): మండలంలోని పలువురు ఆశా కార్యకర్తలను ముందస్తు అరెస్టు చేసినట్లు ఎస్ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. కనీస జీతం రూ.18 వేలకు పెంచాలనే డిమాండ్ తో 'చలో అసెంబ్లీ' కార్యక్రమానికి తరలివెళ్తున్న క్రమంలో సోళీపురం గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ, అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్ల అన్నపూర్ణ, కమ్మరి మల్లేశ్వరి, సల్కెలాపురం గ్రామానికి చెందిన మేడమోని రేణుకను అరెస్టు చేసి ఖిల్లాఘనపురం పోలీస్టేషన్‌కు తరలించారు. వీరిపై కేసు మోదు చేసి అనంతరం విడుదల చేశామన్నారు. ఈ సందర్భంగా ఆశాలు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించమని కోరితే అరెస్టులు చేయడం సరికాదన్నారు.

భక్తిశ్రద్ధలతో తుల్జాభవాని ఉత్సవాలు



చంద్రానాయక్‌తండాలో అమ్మవారి ఊరేగింపులో గిరిజనులు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

అమరచింత: మండలంలోని తండాల్లో మంగళవారం తుల్జాభవానీ మాత ఉత్సవాలను గిరిజనులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇళ్ల ముందు మండపం ఏర్పాటు చేసి అమ్మవారి ప్రతిమను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులతో పాటు మహిళలు సంప్రదాయ దుస్తులను ధరించి అమ్మవారికి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రతి ఇంటి ముందు ఏర్పాటు చేసుకున్న అమ్మవారి మండపం వద్ద పోటేళ్లను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజనీసాయిచంద్ హాజరై అమ్మవారికి పూజలు చేశారు. చంద్రనాయక్ తండా మాజీ సర్పంచ్ శిల్పా శంకర్ నాయక్, హనుమంతు నాయక్, సీత్యానాయక్, వర్షబాబునాయక్, మున్యనాయక్, కుర్మనాయక్ తదతరులు పాల్గొన్నారు.

ఉద్యోగికి సన్మానం

వనపర్తి రూరల్: మండలంలోని చందాపూర్ గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ ఇటీవల వెలువడిన జనరల్ జేఎల్ ఫలితాల్లో తెలుగు సబ్జెక్టులో జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించారు. ఆగస్టులో వెలువడిన గురుకుల ఫలితాల్లో జేఎల్ ఉద్యోగం సాధించి పెద్దమందడి ట్రైబల్ గురుకుల కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం వనపర్తిలోని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నివాసంలో అనిల్‌కుమార్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు చిట్యాల రాము, మండల ఉపాధ్యక్షుడు కురుమూర్తి, నాయకులు హేమంత్, సూర్యవంశం గిరి, నాగరాజు, వెంకటేష్, శ్రీను, నరసింహ, వెంకటేష్, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో అభివృద్ధి శూన్యం



మాట్లాడుతున్న ధారాసింగ్

చిన్నంబావి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా అటు రాష్ట్రంలో, ఇటు నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం అని బీజేపీ నాయకుడు ధారాసింగ్ తెలిపారు. ఆయన మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మంత్రి జూపల్లి గెలిచి ఏడాది కావస్తున్నా సొంత మండలం చిన్నంబావిలో ఏమాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. మండల కేంద్రంలో మరుగుదొడ్లు, టాయిలెట్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వ కార్యాలయాలు ఇంకా అద్దె భవనంలో కొనసాగుతున్నాయన్నారు. ప్రశ్నించేవారిపై దాడులు, అక్రమ కేసులతో మంత్రి ఇబ్బందులు పెడుతున్నారని, మండలంలోని లక్ష్మీపల్లికి చెందిన బొడ్డు శ్రీధర్‌రెడ్డి హత్య జరిగి ఆరు నెలలు కావస్తున్నా నిందితులను పట్టుకోవడంలో పోలీసులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. కనీసం ఆయన కుటుంబానికి అందాల్సిన రైతు బీమాను సైతం ఇప్పటివరకు అందించడం లేదంటే దీని వెనుక ఎవరి హస్తం ఉందో అర్థం అవుతుందన్నారు. స్థానిక ఎన్నికల్లో వీటన్నిటికి సమాధానం చెప్పి ప్రజల్లోకి రావాలన్నారు. కార్యక్రమంలో గోపినాయుడు, ఓబీసీ సెల్ జిల్లా కార్యదర్శి చెన్నయ్య, మండల ఇన్‌చార్జ్ మల్లికార్జున్, సాయిప్రజీత్ గౌడ్, పురేందర్‌గౌడ్, హరికాంత్ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు సరికాదు



చిన్నంబావి: దేశంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూనే, మరోవైపు మతాల మధ్య తగాదాలు సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకొని పరిపాలన చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజేయులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీపీఎం మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మతతత్వానికి వ్యతిరేకంగా సీపీఎం పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది అయినా వారు ఇచ్చిన వాగ్దానాలు నేరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. సామాన్య ప్రజలపై ప్రభుత్వం వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల ఆంజనేయుడు, మండల కార్యదర్శి వెంకటేష్, దర్గాస్వామి, కురుమూర్తి, మహేష్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

పాత బస్టాండ్‌ను వినియోగంలోకి తేవాలి

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న పాత బస్టాండ్‌ను వినియోగంలోకి తెస్తూ.. ప్రజా సౌకర్యాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మంగళవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. బస్టాండ్‌లో తాగునీటి వసతి, షెడ్డు నిర్మాణం చేపట్టాలని వారు కోరారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరగా పనులు ప్రారంభించి, బస్టాండ్‌ను వినియోగంలోకి తెస్తామని డీఎం వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పరమేశ్వరాచారి, కురుమయ్య, బాలస్వామి, గట్టన్న, మదన్, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లింగమయ్య జాతర



నందిమళ్ల ఎక్స్‌రోడ్‌లో లింగమయ్యకు బోనాలు తీసుకొస్తున్న భక్తులు

అమరచింత: మండలంలోని నందిమళ్ల ఎక్స్‌రోడ్‌లో మంగళవారం లింగమయ్య జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు నెత్తిన బోనంతో కటారీలు చేతబూని, భేరీలు మోగిస్తూ ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి స్వామివారికి నైవేద్యాలు సమర్పించుకున్నారు. ప్రతి సంవత్సరం లింగమయ్య జాతరను నిర్వహించుకోవడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ అని గ్రామస్తులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా పోతురాజుల నృత్యాలు, బైనోళ్ల పాటలతో ఆలయ పరిసరాలు లింగమయ్య నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో చుక్క చిన్న ఆశిరెడ్డి, మరాఠి లక్ష్మారెడ్డి, చిన్నబాయి ఆశిరెడ్డి, పరిగి రంగారెడ్డి, మన్యపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



నిర్వాహకులకు నగదు అందిస్తున్న కురుమూర్తి

ఆత్మకూర్: హరిహరపుత్ర అయ్యప్పస్వామి నూతన ఆలయ నిర్మాణం తుది దశకు చేరుకుంది. ఈనెల 14వ తేదీన అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు డాక్టర్ శ్రీధర్‌గౌడ్, గాడి లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం అయ్యప్ప ఆలయంలో దివంగత పోలీస్ శంకర్ కుమారుడు కురుమూర్తిస్వామి ఆలయ నిర్మాణానికి రూ.1,11,116 నగదును నిర్వాహకులకు అందజేశారు.

రేపటి నుంచి ప్రత్యేక పూజలు

ఈ నెల 12, 13, 14 తేదీల్లో ఉదయం నుంచి గణపతిపూజ, పుణ్యాహావాచం, గోపూజ, యాగశాల ప్రవేశం, పంచగవ్య, ధ్వజారోహణం, నవగ్రహ, సర్వతోభద్ర, మండళయోగిని, వాస్తుపూజ, మండపారాధన, అగ్నిప్రతిష్ఠాపన, సర్వదేవత మండప ఆరాధన, తదితర పూజ కార్యక్రమాలను ప్రముఖ వేదపండితులు గోపాలకృష్ణ, పవన్‌కుమార్‌శర్మ, జ్యోషిగోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 14వ తేదీ ఉదయం 9:59 గంటలకు అయ్యప్పస్వామి, గణపతి, సుబ్రమణ్య, పార్వతిపరమేశ్వర, నంది, నాగ, సీతారామలక్ష్మణ, ఆంజనేయ, నవగ్రహ, సంతాన నాగులు, లక్ష్మీవేంకటేశ్వర, సరస్వతి, వీరబ్రహ్మేంద్రస్వామి, ధ్వజ శిఖర ప్రతిష్ఠాపనలు జరుగుతాయన్నారు. ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు అన్నదాన, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు వేలాదిగా తరలిరావాలని కోరారు.

ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలకు ఆహ్వానం

అయ్యప్ప కాలనీలో రూ. 5కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలకు హాజరు కావాలంటూ మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి నిర్వాహకులు, మాలధారులు వేర్వేరుగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో గురుస్వాములు ఎస్టీడీ శ్రీను, మెకానిక్ శ్రీను, జిన్నారం శ్రీను, కూరగాయల రఘు, దివాకర్, భరత్, తోటరవి, అనిల్, గోవర్ధన్, బాలు, రఘు, ఎల్లయ్య, వెంకట్రాములు, నాగరాజు, మాలధారులు ఉన్నారు.

పండుగ సాయన్న ఆశయ సాధనకు కృషి



ఆత్మకూర్‌లో పండుగ సాయన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూర్: ముదిరాజ్‌ల ఆరాధ్యుడు పండుగ సాయన్న వర్ధంతిని మంగళవారం ఆత్మకూర్‌లో ముదిరాజ్‌లు, మత్స్యకారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగ సాయన్న సేవలు చిస్మరణీయమని కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డైరెక్టర్ అశ్విన్‌కుమార్, పండ్ల నగేష్, పోషన్న, అశోక్, గడ్డమీదిశ్రీను, కృష్ణ, పరశురాం, రాజు, రవి, అంజి ఉన్నారు.

పేదల పెన్నిధి

వీపనగండ్ల: పేదల బాగుకోసం అహర్నిశలు తపించిన పండుగ సాయన్న ఆశయాల కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని తెలుగోళ్ల జాతి నాయకులు మిద్దె శ్రీనివాసులు, కృష్ణయ్య, దర్గేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పండుగల సాయన్న చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. పేదలను దోచుకున్న దొరలను, దేశ్‌ముఖ్‌లు, పెత్తందార్లను, పట్వారీలను ఎదిరించి పేదలకు అభ్యున్నతికి పోరాడారని కొనియాడారు. కార్యక్రమంలో సంగమోని కృష్ణయ్య, నక్క వెంకటస్వామి, రామకృష్ణ, నర్సింహ, రాజు, యాదయ్య, శేకర్, మోహన్ బాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: పండుగ సాయన్న వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం సభ్యులు ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్‌సంఘం మండల ఉపాధ్యక్షుడు గోనెల సహదేవుడు, సొసైటీ అధ్యక్షుడు చింతకాయల కురుమూర్తి, కర్రెన్న, చంద్రమౌళి, జ్యోతిరావు, గోనెల రఘు, గోనెల భరత్, బాలరాజు, శ్రీను పాల్గొన్నారు.



షాపురంలో..

వనపర్తి (ఖిల్లాఘనపురం): నిజాం నవాబులు, దొరలు, పటేళ్లు, భూస్వాములు, జాగిర్దారులు, దేశ్‌ముఖ్‌ల అరాచక పాలనలో బానిస బతుకులు అనుభవిస్తున్న పేదల కోసం వారిని ఎదిరించిన మొదటి నాయకుడు పండుగ సాయన్న అని సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జానంపేట రాములు, మండల ముదిరాజ్ సంఘం నాయకుడు కృష్ణయ్య, శ్రీనివాసులు, నరేష్ అన్నారు. మండలంలోని షాపురంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'తెలంగాణ తల్లిని అవమానించడం తగదు'



ఖిల్లాఘనపురంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



మదనాపురంలో..

ఆత్మకూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ పాలన కొనసాగుతుందని, ఏకంగా తెలంగాణ తల్లినే మార్చేసి కాంగ్రెస్ తల్లిని కొలుస్తున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్, విండో అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్ మండ్లరామకృష్ణ, మాజీఎంపీపీ వీరేశలింగం ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక గాంధీచౌక్‌లో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిశేఖం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కార్యక్రమంలో మాసన్న, రవి, జహంగీర్, కురుమూర్తి, విష్ణురెడ్డి, దండు శ్రీను పాల్గొన్నారు.

రూపం మార్చడం సరికాదు

అమరచింత: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నరసింహులుగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహన్ని మార్చడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు బాలరాజు, నాయకులు అబ్రహం, కలాంపాష, పురుషోత్తం, జింక రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన

మదనాపురం: తెలంగాణ తల్లి చిత్రపటానికి మండల కేంద్రంలో మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈసందర్భంగా మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహం మార్చడంతో వారి పతనం ప్రారంభమైందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో విండో వైస్ చైర్మన్ చీర్ల శ్రీనివాసులు, యాదగిరి, ఆవల బాలు, చాంద్‌పాషా, విజయేందర్‌రెడ్డి, రమేష్, జమ్ములు, రామచందర్, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: ప్రభుత్వాలు మారితే తెలంగాణ తల్లి మారుతుందా అని బీఆర్‌ఎస్వీ జిల్లా ఇన్‌చార్జ్ ఏర్పుల శివయాదవ్, రాష్ట్ర సంచాలకులు అమరేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మహేష్, శివప్రసాద్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, అంజనేయులు, గోపాల్, శ్రీను, నరేందర్, వంశీ, నరేష్ పాల్గొన్నారు.

'మర్రి'కి అరుదైన గౌరవం

చిన్నంబావి: ఇటీవల కొల్లాపూర్‌లోని రాణి ఇందిరాదేవి పాఠశాల సిల్వర్‌జూబ్లీని పాఠశాల పూర్వ విదార్థులు అయిన మై హోం రామేశ్వర్‌రావు, మంత్రి జూపల్లి కృష్ణారావు బిట్స్‌పిలాని వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రావు, హర్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జయరాంరెడ్డి ఆధ్వర్యంలో రెండు వేల మంది పూర్వ విద్యార్థులతో వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు వివిధ రంగాల్లో కృషి చేసినందుకు వారికి ప్రత్యేకంగా ఆర్ఐడీ రత్న అవార్డును ప్రదానం చేసేందుకు శ్రీకారం చుట్టారు. దాంట్లో భాగంగా మండలంలోని పెద్దమారు గ్రామానికి చెందిన మర్రి మహేశ్వర్‌రెడ్డి వివిధ రంగాల్లో చేసిన సేవకు, పూర్వ విద్యార్థులను గుర్తించి వారిని ఒక వేదికపైకి తీసుకురావడంలో ఆయన పాత్రకు గాను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రశంసాపత్రంతో పాటు మెమెంటోను బహుకరించారు. అనంతరం ఆయనకు పూర్వ విదార్థుల సంఘం అధ్యక్షుడు సాయిప్రసాద్‌రావు, కార్యదర్శి జగన్మోహన్ రావు తదితరులు శాలువాతో సన్మానించారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

వనపర్తి విద్యావిభాగం: పరావస్తు, రాంకీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డీసీపీ పి.మధుకర్‌స్వామి సమక్షంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ గద్దె భాస్కర్, రాంకీ ఫౌండేషన్ నిర్వాహకులు రామిరెడ్డి తెలిపారు. స్టాఫ్ సెలక్షన్ కమీషన్ ఆధ్వర్యంలో సాయుధ బలగాలు, కానిస్టేబుళ్లు తదితర ఉద్యోగాల భర్తీకి అవసరమైన శిక్షణ ఇస్తామని, సాయుధ బలగాల నియామకంలో భాగంగా 40 వేలకు పైగా కానిస్టేబుళ్ల భర్తీకి కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కొన్ని జిల్లాకేంద్రాలలో ఈ నెల 22వ తేదీన అర్హత పరీక్ష నిర్వహించి, 25న ఫలితాలు ప్రకటిస్తారు. డిసెంబరు 28వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు రాంకీ ఫౌండేషన్ లేదా పరావస్తు ఫౌండేషన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని, 95424 33427 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.